# తోడూ - నీడా!

ఇల్లురాగానే స్కూటర్ ఆపింది ఆశారాణి. ఆమెదిగి స్టాండు వేసింది. సీటుకు ముందు హేండిల్ పట్టుకుని నిలబడి ఉన్న పాపవైపు చూసింది.

నుదుటిమీద కదలుతున్న నల్లని ముంగురులతో, చక్రాల్లా తిప్పుతున్న కళ్ళతో, ఎర్రని బుగ్గలతో ఆ పాప ముద్దులు మూట కట్టేటట్టు ఉంది. ఆచిన్నారి తన కూతురు అనుకోగానే ఆశారాణి మనస్సు ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయింది. కళ్ళలో ముత్యాలంతలేసి కన్నీటిబొట్లు నిలిచాయి. వాటిని తుడుచుకోకుండానే-

"రామ్మా! ఇదేమనిల్లు'' రెండుచేతులుచాపి పిలిచింది. ఆశారాణి వైపు చూసింది ఆ పాప.

''ఏలుత్తున్నావా? ఏలవకు" అంది ముద్దు ముద్దు మాటలలో. ఆ తల్లికి తాను తల్లై ఓదార్చింది ఆ బిడ్డ.

ఆ వెచ్చని ఓదార్పు కోసమే ఇన్నాళ్ళు ఎదురు చూసింది.

ఆశారాణి.

''ఇంక ఏడవనమ్మా! నువ్వు వచ్చేసావుగా" చెక్కిళ్ళవరకు జారిన కన్నీటిని తుడుచుకుంది.

రెండు చేతులు చాపిన ఆ బిడ్డను ఎత్తుకుని గుండెలకు హత్తుకుంది.

"మన ఇంటికి వెడదామా''

"ఓ!'' అంది ఆపిల్ల.

ఇరుగు పొరుగులంతా తన ఆశాజ్యోతిని చూస్తున్నారో లేదోనని అటు ఇటు చూసింది ఆశారాణి. అటుపక్కావిడ, ఇటుపక్కావిడ, ఎదురింటావిడ అందరు వచ్చి వీధుల్లో నిలబడి ఉన్నారు.

"నిన్న మొన్న లేని పాప ఈరోజు ఎలా వచ్చింది" వారికి ఆశ్చర్యంగా ఉంది.

''ఇన్నాళ్ళు సమాజంలో నేను ఎవరో తెలియక బ్రతికాను. ఈ నాటినుంచి తెలిసి బ్రతుకుతాను" అనుకుంది మనస్సులో. ఏదో తెలియని కొత్త ఉత్సాహం ఆమెలో ప్రవేశించింది.

''మా పాపండీ'' అంది వారి వైపు తిరిగి.

''అలాగా! బాగుందమ్మా!'' అందరి కంఠాలు ఒక్కసారి పలికాయి. అందరివైపు గర్వంగా చూసింది ఆశారాణి. పిల్లను ఎత్తుకునే గేటు తీసుకుని మెట్లు ఎక్కింది. తర్వాత తాళం తీసుకుని ఇంట్లో అడుగు పెట్టింది.

చిన్న సంసారానికి సరిపడిన ఇల్లు అది. ఒక పడకగది, డ్రాయింగురూము, డైనింగుహాలు, వంట గది ఉన్నాయి. ఆ రోజు ఆశారాణి కంటికి అదే పెద్ద భవనంలా కనబడింది.

"ఈ ఇల్లంతా మనదే! బాగుందా" అయిదేళ్ళకూతుర్ని అడిగింది.

కళ్ళు తిప్పి అటు ఇటు చూసింది ఆపాప.

"చాలా బాగుంది" అంది పెద్ద ఆరిందాలా.

"నాపాపే! నీకు నచ్చిందా! నాకు అదే కావాలమ్మా" ఆపిల్ల బుగ్గలను ముద్దులతో ముంచెత్తింది ఆశారాణి.

జ్ఞానం వచ్చిన తరువాత ఆ అనుభవం అలవాటులేని ఆ పిల్ల రెండు చేతులతోను బుగ్గల్ని తుడుచుకుంది. కాస్త బెరుకుగా చూసింది ఆ పిల్ల.

కిందటి రోజు కొని అలమారులో దాచి పెట్టిన బొమ్మలు తీసి ఆ పిల్ల ముందు పెట్టింది.

వాటిని చూసిన ఆపిల్ల ముఖం మతాబులా వెలిగింది. కళ్ళు మరింత వెడల్పుచేసి ఒక్కొక్క బొమ్మే తీసి చూస్తోంది.

ఒక బొమ్మకు కీ ఇచ్చి నేలమీద వదిలింది ఆశారాణి. రెండు చేతులతో డమ డమ డప్పు కొట్టింది ఆ బొమ్మ.

రెండు చేతులు కొడుతూ సంతోషంతో మంచం మీద గంతులేసింది పాప.

"ఇదిగో ఇటు చూడాలి'' అంటు మరో బొమ్మకు కీ ఇచ్చి వదిలింది. స్కూటర్ మీద బొమ్మ గిర గిర తిరుగుతోంది.

"మన కూటర్ లాగే ఉంది. ఆ పాప ఎలా తిరుగుతోందో" పక పకా నవ్వింది ఆ పాప.

ఆ నవ్వుకు మంచి ముత్యాలు రాలి తన ఒడిలో పడినంత సంబర పడింది ఆశారాణి.

"బిస్కట్టు తింటావా?" తాను కొని దాచినవన్నీ ఆ పిల్లకు పెట్టాలని తొందరపడుతోంది ఆ తల్లి మనసు.

"ఇప్పులొద్దు అన్నంతినే టైం అయింధిగా''

"నీకెలా తెలిసిందమ్మా!" ఆశ్చర్యంగా అడిగింది ఆశారాణి

"అదిగో చీకటి పడిందిగా" వీధి కిటికివైపు వేలు చూపించింది.

అంత క్రమ శిక్షణలో పెంచిన ఆశ్రమాన్ని మనస్సులోనే మెచ్చుకుంది ఆశారాణి.

ఆ చిన్నారి ముఖాన్ని రెండు చేతులలోను పొదివి పట్టుకుంది. "బబ్బ పోసుకుని బువ్వ తింతావా" కూతుర్ని ముద్దు చెయ్యడానికి ఆ తల్లికే ముద్దు ముద్దు మాటలొస్తున్నాయి.

సమాధానంగా తలాడించింది.

దారిలో కొని తొడిగిన మేజోళ్ళు, బూట్లు, గౌను విప్పి పక్కకు పెట్టింది. బాతురూములోకి తీసుకెళ్లి పీట మీద కూర్చో పెట్టింది. ఒళ్లు రుద్దుతూ వేడి నీళ్ల స్నానం చేయించింది, ఒళ్లు తుడిచి పౌడరు అద్దింది, నైట్ గౌను తొడిగింది. అన్నం కలిపి ఆరు బయటకు తీసుకువచ్చింది.

అప్పుడే చంద్రోదయమైంది. ఆకాశంలో చందమామ నవ్వుతూ పలకరించినట్లయింది.

"చంద మామరావె, జాబిల్లిరావె" అన్న పాట అనుకోకుండా నోటికి వచ్చింది ఆశారాణికి.

ఆ పాట పాడుతూ పాపకు అన్నం తినిపించింది.

ఆ పిల్ల నీళ్ళగ్లాసు అందుకుని తాగబోయింది.

"బబ్బ తాగుతావా"

ఔను అన్నట్లు తలాడించింది ఆ పిల్ల.

"నీకు ఏం కావలసివచ్చినా మీ అమ్మను నేను ఉన్నాగా, నన్ను అడగాలి తెల్సిందా"

"సరేనమ్మా" అనుకోకుండా నోటికి వచ్చింది ఆ మాట.

ఆ పిలుపుకి ఆ తల్లి శరీరం గగుర్పొడిచింది,

"ఎవరు చెప్పారమ్మా! నీకు నేను అమ్మనని."

ఒక్క నిముషం ఆలోచించి నువ్వే చెప్పావమ్మా!"

సంతోషం దాచుకోలేక ఆ పాప నుదుటి మీద చుంబించింది ఆశారాణి.

ఈసారి ఆ పిల్ల నుదుటిని చేతులతో తుడుచుకోలేదు.

అన్నం తినడం పూర్తి కాకుండానే ఆ పాప కళ్ళు మూతలు పడుతున్నాయి. ఎలాగో అలాగ రెండు ముద్దలు తినిపించింది. మూతి కడిగి మంచం మీద పడుకో బెట్టింది.

ఆ చిన్నారికి అవన్నీ కొత్త అనుభవాలు. ఆ తల్లికి అవన్నీ ఒక్కసారి తీరే సమయం వచ్చేటప్పటికి ఆ సంతోషం దాచుకోలేకపోతోంది. నిద్రపోతున్న ఆ పిల్లను జోకొడుతూ అలాగే కూర్చుంది.

అంతలో వీధి తలుపు చప్పుడయింది. వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా తనలో పనిచేసే తన ఆత్మీయురాలు నిలబడింది.

"రాప్రియా! నీకు నాకూతుర్ని చూపిస్తాను" ఆమె చెయ్యి పట్టుకొని గదిలోకి లాక్కుపోయింది.

ఆమెకు మతి స్థిమితం తప్పిందనుకుంటున్న సుప్రియ ఎదురుగా మంచంమీద పడుకున్న పాపను చూసింది. ఈసారి ఆమెకే మతి తప్పినట్లయింది.

"నువ్వు వస్తావనుకోలేదు" స్వీట్సు దాచి ఉంచేదాన్ని. అయినా చూస్తానుండు"

అలమారు తెరచి చూసింది ఆశారాణి. ఇందాక పాపను తీసుకు వచ్చేటప్పుడు పిల్లలందరికి పంచిపెట్టింది స్వీట్సు. డబ్బాలో రెండు మిగిలిపోయాయి. వాటిని తీసి ప్రియా నోట్లో కుక్కింది.

కాస్తమింగి ఊపిరి సలుపుకుంది సుప్రియ.

"ఆశా ఈ పిల్ల...." సుప్రియ మాటలు పూర్తికాలేదు.

"నా కూతురు"

ప్రియ మరింత ఆశ్చర్యపోయింది.

"ఆశా; ఏమిటిదంతా. మీ ఆయనేదే. ఇంత పెద్దపిల్ల నీ కూతురంటా వేవిటి?"

"ప్రియా! ఇదంతా ఒక కథ. ఇన్నాళ్ళు నీతో సరదాగా గడిపిన నా సంగతి నీకు తెలియదు. మనస్సులో మంటలు దాచుకొని నీతో నవ్వుతున్నాను సంసారం బయటపెట్టుకోడం ఇష్టంలేక అన్నీ ఈ కడుపులో దాచుకున్నాను. ఇంక భరించేశక్తి లేకపోయింది ప్రియా!" రెండు చేతులతో ముఖం కప్పుకొని వెక్కి వెక్కి ఏడ్చింది ఆశారాణి. "ఆశా! ఏడవకు. నిన్నేమీ అడగనులే. ఇల్లు కావాలంటే చూపించాను. నువ్వు, మీ ఆయన ఉంటారనుకున్నాను" పమిట కొంగుతో ఆశారాణి కళ్ళు తుడిచింది.

"ఈరోజు నువ్వు అడక్కపోయినా చెబుతాను, బీటుపడిన కుండ ముక్కలవ్వకుండా ఎన్నాళ్ళు ఉంటుంది. మా సంసారంకూడా అంతే... నేను ఒక ప్రయివేటు కంపెనీలో పనిచేస్తూ ఉండేదాన్ని. మా నాన్నగారు అప్పటికే రిటైరై ఇంట్లో ఉండేవారు. ఆయన నాపెళ్ళి ప్రయత్నాలు గట్టిగా ప్రారంభించారు. అసలు నాకు అప్పుడే పెళ్ళిచేసుకోవాలని లేదు. నా సంపాదనతో నా తల్లి తండ్రులను కొన్నాళ్ళు ఆదుకోవాలని అనుకొన్నాను. నాకు ఆ అవకాశం దొరకలేదు. మా తల్లిదండ్రులకు మేమంతా ఆలస్యంగా పుట్టాం. అప్పటికే వాళ్ళకి వయస్సు మీరింది.

"నీకు పెళ్ళికాకపోతే మిగిలినవారి సంగతి ఏమిటమ్మా! నీ సంపాదనతో బ్రతకడం సిగ్గుగా ఉందమ్మా. పిల్లా పాపలతో నువ్వు

సుంఖంగా ఉంటే చూడాలని ఉంది. పైగా నువ్మ నీ వెనక వాళ్ళ సంగతి కూడా ఆలోచించాలి. నీకు పెళ్లికాకపోతే నీ చెల్లిపెళ్ళిసంగతే మిటమ్మా" అనేవారు మా నాన్నగారు—

"నిజమే పదిమందిలోపు ట్టిన నేను పదిమందికి అడ్డుగా ఉండ కూడదనుకున్నాను. పెళ్లికి సరే అన్నాను. మా వూళ్ళోనే బాంకులో పనిచేస్తున్న నరేంద్రతో నా పెళ్లి జరిగిపోయింది. వెంటనే నన్ను కాపు రానికి తీసుకు వెళ్ళారు.

నేను ఉద్యోగం చెయ్యడానికి ఎవరూ ఇష్టపడలేదు. నరేంద్ర కూడా వాళ్ళకి వంతపాడాడు. అత్తవారింటికి వెళ్ళిన మరునాడే ఉద్యోగా నికి రాజీనామా ఇవ్వవలసి వచ్చింది.

"ఇంట్లో చెయ్యడానికి చేతినిండా పని ఉంది. తినడానికి తిండి ఉంది. ఇంక ఆడదానికి ఉద్యోగావసరం ఏమిటి?" అందరూ అనేమాట నిజమే అనిపించింది నాకు కూడా.

రోజులు గడిచినకొద్దీ ఇంటెడుపనీ నానె త్తిన పడింది. తలవంచు కుని చేసుకుపోయే వారిని చూస్తే అందరిలో బద్ధకం పెరుగుతుంది. కాబోలు. రాత్రి అయ్యేసరికి చెప్పలేని అలసట ఒళ్ళంతా నొప్పులు. నన్ను ఓదార్చడానికి బదులు నరేంద్ర నన్ను చీదరించుకునేవాడు. అది నన్ను మరింత బాధించేది.

దీనికి సాయం—పెళ్ళై రెండేళ్ళు అయినా సంతానంలేదని మా అత్తగారు ఆడబిడ్డలు సాధింపు ప్రారంభించారు.

అయినా పిల్లలంటే నాకు చిన్నతనం నుంచి చాలాఇష్టం. డాక్టరు దగ్గరకు వెడదామని నరేంద్రను ఏన్నోసార్లు బ్రతిమాలాను. అతను వినిపించుకునేవాడు కాదు.

ఒకరోజు మా అత్తగారే నన్ను లేడీ డాక్టరు దగ్గరకు తీసుకు

వెళ్ళింది.

నరేంద్రతో సరదాగా వెళ్లాలనినా కోరిక ఆకోరికతీరదని నాకు తెలిసిపోయింది. నన్ను పరీక్ష చేసిన లేడీ డాక్టరు నాలో ఏలోపము లేదని నా భర్తను వచ్చి పరీక్ష చేయించుకోమని చెప్పింది. నరేంద్ర మా అత్తగారిమాట వినలేదు. నామాట అసలు వినిపించుకోనేలేదు.

కొడుకుమీద కోపమంతా ఆవిడ నా మీద చూపించడం మొదలు పెట్టింది. ఇంతలో మా చెల్లెలు ఎవరినో ప్రేమించి పెళ్ళిచేసుకుని ఇంట్లోనుంచి చెప్పకుండా వెళ్ళి పోయింది. మా తమ్ముడు చదువు సంధ్యలు లేక ఇంటిపట్టున ఉండక పోవడంవల్ల మా తల్లిదండ్రులు బెంగతో మంచంపట్టి, చూసే వారు లేక మరణించారు.

నోటమాటరాక వెక్కి వెక్కి ఏడ్చింది ఆశారాణి.

"ఆశా! ఇన్నాళ్ళు ఎవరితో చెప్పకుండాఎలాపడ్డావు ఈ బాధంతా? అన్నీ గతించి పోయాక ఇప్పుడు ఏడిస్తే ఏం ప్రయోజనం?"

"ప్రయోజనంలేదని నాకూ తెలుసు. కాని బాధ ఉప్పెనలాంటిది నా బాధ అంతా నరేంద్రతో చెప్పుకోవాలనుకునే దాన్ని. కాని నేను పనంతా ముగించుకుని గదిలోకి అడుగు పెట్టేటప్పటికి నరేంద్ర గాఢ నిద్రలో ఉండేవారు. ఓదార్చే వారు లేక నాలో నేనే కుమిలిపోయేదాన్ని. చివరకు నెనే ఓదార్చుకునేదాన్ని.

ఒక రోజు నరేంద్ర ఇంటికి వచ్చి "ఆశా నాకు ఈ వూరు నుంచి ట్రాన్స్ఫరయింది. మనం వెళ్ళిపోదాం" అంటూనే నన్ను దగ్గరకు తీసుకున్నాడు. ఆ వెచ్చని కౌగిలిలో నేను సర్వం మరిచిపోయాను. ఒక్కసారి నా గుండెలో గూడు కట్టుకొని ఉన్న బాధ అంతా కరిగిపోయినట్లయింది. అతని సంతోషానికి అంతేలేదు. నాకు ఆనాడు తెలియలేదు. ఈనాడు తెలిసింది."

"ఆశా! ఏమిటిదంతా."

"ప్రియా! కంగారుపడకు నేచెప్పేది విను. అత్తింటి చాకిరీ తప్పుతుందని నాకు చాలా సంతోషంగానే ఉంది. అన్నీ సర్దుకుని ఇద్దరం ప్రయాణం అయ్యాం. ఈ వూరువచ్చి చిన్న ఇల్లు అద్దెకు తీసుకు కాపురం పెట్టాం. ఇంట్లో ఎక్కువ సామానులేదు. అయినా నాకు ఎందుకో ఆ ఇల్లునాది, ఈ సంసారం నాది అనుకోగానే చెప్ప రాని సంతృప్తి అనిపించింది. ఇంటిని ఎంతో చక్కగా సర్దుకునేదాన్ని. ఇంటిముందున్న పది అడుగులు ఖాళీస్థలంలో నాకు నచ్చిన పూల మొక్కలు వేసుకున్నాను. ఏదో పని కల్పించుకుని చేసుకునేదాన్ని.

ఈ వూరు వచ్చింది మొదలు నరేంద్ర ఆఫీసునుంచి ఆలస్యంగా వచ్చేవాడు. నేను నిలతీసి అడిగితే "ఆఫీసులో పని ఎక్కువగా ఉంది ఆశా! నన్ను వేధించకు అనేవాడు.

నా కళ్ళలో నీళ్ళు తిరిగేవి. నన్ను ఓదార్చే వారెవరు ప్రియా! ఆ పరిస్థితుల్లో ఎవరు ఉండి ఏం చెయ్యగలరు?

ప్రియా సమాధానం చెప్పడానికి తడుముకుంది. "నరేంద్ర కేంపులకని వెళ్ళి నాలుగురోజుల వరకు ఇంటికి వచ్చేవాడు కాదు. ఇంట్లో నాకు కాలక్షేపమే లేదు. నేను నాటిన మొక్కలు మొగ్గలేసి పూలు పూస్తున్నాయి. కాని, నా జీవితం రోజురోజుకు మోడుబారి పోతోంది.

ఉద్యోగం చెయ్యాలనే కోరిక నాలో తిరిగి ప్రారంభమయింది. ఒకనాడు పేపర్లో పడిన ఎడ్వర్టైజ్‌మెంటు చూసి అప్లికేషన్ పెట్టాను. నెల్లాళ్ళు తిరగకుండానే మన ఆఫీసులో నాకు ఉద్యోగం దొరికింది. నీతో పరిచయం అయింది. ప్రియా! నా జీవితంలో నీ స్నేహ మొక్కటే నాకు ఉపకరించింది. ఆశా కళ్ళు వర్షిస్తూనే ఉన్నాయి.

"ఆశా! ఇంక ఏడవకే!" అన్న ప్రియా మాటలు వినిపించుకోనే లేదు ఆశారాణి.

"నరేంద్రతో నా ఉద్యోగం సంగతి చెబితే "సరే నీ ఇష్టం" అన్నాడు. అంత తేలిగ్గా అతను ఎలా ఒప్పుకున్నాడో నాకే తెలియ లేదు. రోజూ ఆఫీసుకు వెళ్ళివస్తున్నాను. అయినా నన్ను ఒంటరితనం చలిలా కొరుక్కు తినడం ప్రారంభించింది. దానినుండి తప్పించుకోలేక పోతున్నాను."

ఆశా! ఆఫీసులో చేరింది మొదలు నాకు అన్నీ తెలుసుకదా! ఇంకా బాధపడి ఏం ప్రయోజనం?"

"ప్రియా! నీకు తెలిసింది పైపై మెరుగులు. అసలు సంగతి చెప్పనీ."

"సరే! కానీ! ఆశా ఇప్పటికి ఎనిమిది దాటింది. నేను ఇంటి కెళ్ళాలి." "ఈ పూట ఇక్కడే తిందుగాని వంటంతా ఉంది. కప్పు కాఫీ తాగుదాం ఉండు" ఆశారాణి వెళ్ళి కాఫీ కలిపి కప్పుల్లో పోసి పట్టుకొచ్చింది. కాఫీ తూతాగునే తిరిగి చెప్పడం ప్రారంభించింది. "రానురాను నాకు నరేంద్ర మీద నమ్మకం తగ్గిపోయింది. మనసువిప్పి నాతో మాట్లాడటమేలేదు. ఇంటికి అడావిడిగా వచ్చి వెళ్ళిపోయేవాడు. రానురాను ఇంటి ఖర్చు అంతా నామీన పడింది. నీ జీతం ఏమి చేస్తున్నావంటే చెప్పేవాడు కాదు.

మన ఆఫీసులో స్కూటర్‌కి లోను ఇస్తున్నారంటే నీ ప్రోత్సా హంతో నేను అప్లయి చేసాను. స్కూటర్ వచ్చింది. అది చూసి మహా సంబరపడ్డాడు నరేంద్ర. మూడు రోజులలో నేర్చుకుని స్కూటర్ వేసుకుని ఆఫీసుకు వెళ్ళడం ప్రారంభించాడు.

కాని నేను ఆఫీసుకు వెళ్ళడం కష్టమయింది. బస్సు స్టాపులలో

గంటల తరబడి నిలబడటం తర్వాత అంత రష్‌గా ఉన్న బస్సులు ఎక్కలేక నానా యాతనా పడటం విసుగనిపించింది. నేనే స్కూటర్ నేర్చుకుంటే బాగుంటుందనే ఆలోచన నాలో కలిగింది. ఎంతోమంది ఆడవాళ్ళు స్కూటర్లమీద వెళ్ళి వస్తున్నారు.

నరేంద్ర కేంపుకి వెళ్ళినప్పుడు స్కూటర్ నేర్చుకోడం ప్రారంభించాను. అతి సునాయాసంగా వచ్చేసింది. డ్రైవింగ్ లైసెన్సు కూడా అతనికి తెలియకుండానే సంపాదించాను. నరేంద్రకు చెప్పలేదు. కేంపుకెళ్ళిన నరేంద్ర వారం రోజులకు తిరిగివచ్చాడు. స్నానంచేసి భోజనంచేసి తిరిగి వెళ్ళిపోతున్నాడు. నాకు చాలా బాధ అనిపించింది. ఎలా ఉన్నావని కూడా నన్ను అడగలేదు.

"మీకు ఆఫీసు, కేంపులు తప్ప ఏమీ అక్కరలేదా?"

"ఎందుకక్కరలేదు?"

"నన్ను పలకరించడానికి కూడా మీకు టైంలేదనుకుంటాను?"

"ఆహా! ఎదురుగా తిరుగుతున్నావుగా? ఇంక ఏమి పలకరించాలి"

"మొన్న మూడురోజులు జ్వరం వచ్చింది. ఎంత బాధపడ్డానో తెలుసా!"

"నీకు జ్వరంవస్తే నన్నేం చెయ్యమన్నావు? డాక్టర్ని పిలిచి మందు వేసుకోపోయావా?"

"డాక్టర్ని పిలిచేవాళ్ళు ఉండాలిగా?"

"నీ ఫ్రెండు ఉందిగా. కబురు చెయ్యకపోయావా? అయినా, ఎప్పుడో జ్వరంవస్తే ఇప్పుడు అల్లరిదేనికి?"

ఆ మాటలకు నాలో పట్టుదల మరింత పెరిగింది. ఎప్పుడు వాదించని మనిషిని రెచ్చిపోయాను.

"అంటే నేను చచ్చినా మీకు అక్కరలేదన్నమాట."

"ఆ మాట నేననలేదు! నువ్వే అనుకుంటున్నావు. ఛీ!ఛీ! వెధవ సంసారం. ఇంటికొస్తే బతకనివ్వవు?" అంటూ వీధి తలుపులు బదేల్న వేసి వెళ్ళిపోయాడు. నాకు ఏడుపు వచ్చింది.

చాలా సేపు ఏడుస్తూ మంచంమీద పడుకున్నాను. ఆరోజు నేను ఆఫీసుకు వెళ్ళలేదు. సాయంకాలం మొక్కల్లో కుర్చీ వేసుకుని కూర్చున్నాను. సూర్యుడు అస్తమించేవేళ అయింది. పల్చని కాంతి మొక్కల మీదపడి వింతగా మెరుస్తోంది. పూలతావిలో కలిసి చల్లనిగాలి వీస్తోంది. అంత అందమైన ప్రకృతిలో కూడా నేను సరదాగా ఉండలేకపోయాను.

అంతలో ఆ పక్కింట్లో ఉంటున్న నారాయణ వచ్చాడు. అతను నరేంద్ర స్నేహితులయ్యారు. నరేంద్ర లేనప్పుడుకూడా అతనికి రావడం అలవాటు. నా పక్కనే ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

"నరేంద్ర ఊళ్ళో లేరా?"

"లేరు." మళ్ళీ సద్దుకుని "ఉన్నారు" అన్నాను.

"నరేంద్ర తరచు కాంపుల్లోనే ఉంటున్నారు. ఊళ్ళో ఉన్నా పాపం అతనికి అసలు తీరికే ఉండదనుకుంటాను. మీ వయసంతా అడవిన కాచిన వెన్నెల్లా అయిపోతోంది" అంటూనే చెయ్యి జరిపి నా చేతిమీద వెయ్యబోయాడు.

నాకు ఆపుకోలేనంత కోపం వచ్చింది. చెయ్యి ఎత్తి దవడ పగలగొట్టాలనుకున్నాను. కాని అతన్ని కొట్టడంవల్ల నాకు వచ్చే ప్రయోజనం ఏమీ లేదనిపించింది.

"అంతగా మీరు నన్ను గురించి బాధపడుతున్నారు కనక మనిద్దరం పెళ్ళిచేసుకుందాం" అన్నాను.

"పెళ్ళా! మిమ్మల్నా! మీకు పెళ్ళయిందిగా. పైగా భర్త ఎదురుగా వున్నారుగా" అన్నాడు కంగారుపడుతూ.

"విడాకులిస్తాను. దానిదేముంది."

"ఒకసారి పెళ్ళయిన ఆడదాన్ని ఎవరు చేసుకుంటారండి". అతని మాటలు తడబడ్డాయి.

"పెళ్ళయిన ఆడదానితో అక్రమసంబంధం పెట్టుకోడానికి అడ్డు రానిది పెళ్ళికి ఎందుకు అడ్డు? నీ మనస్సు కనిపెడదామనే అడిగా? యు షటప్ అండ్ గెట్ అవుట్" అరిచాను.

అక్కడనుంచి జారుకున్నాడతను.

ఆడది కాస్త చనువిచ్చి మాట్లాడితే చాలు, మగవాళ్ళకు ఇదే అర్థం కనపడుతుందనుకుంటాను? ఛీ ఛీ! ఈసారి నాకు ఏడుపురాలేదు. విరక్తి కలిగింది.

ఆరోజు నరేంద్ర ఇంటికి రాలేదు. మరునాడు ఆదివారంకూడా ఇంటికి రాలేదు. ఆ సాయంకాలం నువ్వు మా ఇంటికి వచ్చావు గుర్తుందా?"

"ఆఁ గుర్తులేకేం, మనం సినిమాకు కూడా వెళ్ళాం."

"అవును వెళ్ళాం. సినిమా మధ్యలో కళ్ళు తిరుగుతున్నాయి అన్నాను గుర్తుందా?"

"లేకేం. నేను కూల్‌డ్రింక్ పట్టుకొచ్చి తాగించాను. తర్వాత ఆటోలో ఇంటికి వచ్చేశాంకదా."

అవును. నీకు అంతవరకే తెలుసు. నువ్వు నీకు నెల తప్పిందేమో కళ్ళు తిరుగుతున్నాయని డాక్టరుకి చూపించుకోమని తొందర పెట్టావు. కాని అదేం కాదు."

"ఆఁ ఇంతకూ అసలు సంగతి ఏమిటి?"

"చెబుతున్నాను. మనం కూర్చున్న ముందు వరుసలో నరేంద్ర కూర్చున్నాడు. అతనిపక్కనే ఒక స్త్రీ. ఇద్దరి ఒడిలోనూ పిల్లా,

పిల్లాడు."

"అకా! ఏమిటిదంతా?"

"ఆ యదార్థం భరించలేక కళ్ళు తిరిగి పడిపోయాను. కాని నీతో చెప్పలేకపోయాను. ఆనాడే నిర్ణయించుకున్నాను. అతనితో సంసారం. చెయ్యలేనని ఆ ఇంట్లో ఉండలేనని నిన్ను ఇల్లు వెతక మన్నాను తెలిసిందా."

"దీని వెనక ఇంత కథ ఉందనుకోలేదు అకా!"

"నరేంద్ర మొహం ఇంక చూడకూడదనుకున్నాను. అతను రాకుండానే ఇల్లు వదిలేయాలనుకున్నాను. కాని నాకు ఇల్లు దొరక కుందానే అతను మూడవనాడు ఇంటికి వచ్చాడు.

అప్పటికే నాకు ఆఫీసు టైం అయింది. అతనిని చూడనట్టే నటించాను. ఆఫీసుకు వెళ్ళాలని స్కూటర్ తీసి స్టార్ట్ చేసాను.

"నువ్వు స్కూటర్ నేర్చుకున్నావా? ఎక్కడికి బయలుదేరు తున్నావు?" పులిలా గర్జించాడు.

అతనితో వాదించడం ఇష్టంలేదు భార్యాభర్తలిద్దరు నువ్వెంత అంటే నువ్వెంత అనుకోడం అసహ్యకరమైన పని అని తెలుసు. కాని ఆ సమయంలో అతనికి సమాధానం చెప్పక తప్పదు.

"మీ మగవారు బయలుదేరడం లేదా? మేం వెడితే తప్పేముంది. మీలాగే ఉద్యోగాలు చేస్తున్నాం. మీలాగే సంపాదిస్తున్నాం. మాకు ఏం తక్కువని?"

"ఇంతకీ స్కూటర్ నీదనేగా నీ అలుసు." కోపంతో అతని గొంతుక పెరిగిపోతోంది. అయినా నేను లెక్కచెయ్యలేదు. మనిషి మీద గౌరవంచెడిన తరువాత భర్త అయినా, ఎవరైనా ఒక్కటే.

"ఆఫ్‌కోర్స్" అన్నాను.

"You shut up" అన్నాడు చెయ్యి పైకి ఎత్తి.

"నరేంద్రా! నేనా మాట అనలేకకాదు" కాని నీ అంత అవివేకిని కాదు నేను: నీలాగే చీము, నెత్తురు నాలో ప్రవహిస్తున్నా నీ పరువును నీ కుటుంబ పవురును నిలబెట్టాలని తాయత్రయపడుతున్నాను. నాలో కోరికలు విజృంభిస్తున్నా ఈ దేశంలో పుట్టిన ఆడదానిగా నా కోరికలు నాలోనే చంపుకుంటున్నాను. నువ్వు మరో భార్యతో కులుకుతున్నా ఈ ఇంటిని అంటిపెట్టుకుని ఉన్నాను. నువ్వు మరో సంతానంతో సుఖ పడుతున్నా నేను గొడ్రాలిలా బ్రతుకుతున్నాను."

అంతే అతను ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు. గదిలోకి వెళ్ళి తలుపులు గడియ వేసుకున్నాడు కాసేపు. తర్వాత బయటకు వెళ్ళి పోయాడు.

అప్పుడు నేను ఊహించుకోగలిగాను. అతను ఆపరేషన్ అయిన తరువాతే నన్ను బహుశా పెళ్ళి చేసుకుని ఉంటాడని.

ఆ సాయంకాలమే నేను ఈ కొత్త ఇంటికి వచ్చాను. అయినా నన్ను వంటరితనం పీడిస్తోంది. నిన్న ఆఫీసునుంచి వస్తూంటే ఒకావిడ స్కూటరుమీద వెనుక పిల్లను కూర్చోపెట్టుకుని పోతోంది. కనుచూపు మేరవరకు అలాగే చూస్తూ నిలబడ్డాను.

నాలో కొత్త ఆశలు చిగురించాయి. కొత్త కోరికలు తలెత్తాయి. నేను కూడా అలాగే నా పాపను నా స్కూటర్‌మీద కూర్చోపెట్టుకుని తిప్పాలి. నాకు పాప కావాలి. ఆమే నాకు ఇక తోడు-నీడ.

ఈరోజు సాయంకాలం అనాధాశ్రమం వైపు వెళ్ళాను ఇదిగో ఈ చిన్నారిని తీసుకువచ్చాను.

"మీ ఆయన ఇంటికి వస్తే?"

"ప్రియా! ఇంక అతని మాట నా దగ్గర తలపెట్టకు. ఇదిగో

నా కూతురు ఎలా ఉందో చెప్పు?"

"ఎంతో ముద్దుగా ఉందే. మరి నీ కూతురికి నామకరణం ఎప్పుడే? మరి మాకు పార్టీ ఎప్పుడే?"

"ముందు నువ్వు పేరును నిర్ణయించు. అప్పుడే నామకరణం పార్టీ కూడా."

"ఆశా! ఈ పిల్లకు "దీపిక" అని పెట్టవే"

"ప్రియా-ఆ పేరు చాలా బాగుంది. అయితే ఎల్లుండి ఆదివారం నామకరణం చేసి ఈ వీధిలో అందరికి పార్టీచేస్తాను అంది సంతోషంగా.

ఆస సంతోషాన్ని చూసి ప్రియ మనస్సు కుదుటపడింది. తర్వాత ఇద్దరు భోజనాలు చేసారు. పార్టీని గురించే చర్చించుకున్నారు. తర్వాత ప్రియ వెళ్ళిపోయింది.

అన్నీ సర్దుకుని ఆశారాణి కూతురి పక్కలో చేరి ఆప్యాయంగా కూతురి వంటిమీద చెయ్యివేసి పడుకుంది.

ఆ పిల్లకూడా తల్లి గుండెలమీద చెయ్యి వేసింది.

"నువ్వేనమ్మా! నాకు తోడు నీడా" అనుకుంటూ మరింత దగ్గరకు తీసుకుంది ఆశారాణి. నారి కిటికీలోనుంచి తొంగిచూస్తున్న చంద్రుడు చల్లని కాంతులు కురిపించాడు.

కృష్ణాపత్రిక
హైదరాబాదు

✻ ★ ✻